నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 8 జనవరి 2025 | SANGAREDDY

దాతల ఔదార్యం

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముందుకు

ముందుకు వచ్చిన దాతలు

రాయపోల్,జనవరి 7 : పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి సాయత్రం అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఎవరైనా దాతలు ముందుకు రావాలని పాఠశాల హెచ్ఎం కోరారు. దీనికి దళిత బహుజన నాయకులు సంబగ యాదగిరితో పలువురు ప్రతిరోజు సాయంత్ర అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చారు. పిల్లలు బాగా చదివి బాగా స్థిరపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ హుస్సేన్, షకీల్ పాషా, నర్సింలు, సుధాకర్, మహిపాల్, జంపన్న, మహేశ్, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- సీఎం రేవంత్ రైతుద్రోహి
- ఆరుగ్యారెంటీల అమలేదీ
- స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- కాలువలకు నీళ్లు వదిలి చెరువులు నింపాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ
- చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ వద్ద ఆందోళన
- హామీలు అమలు చేయాలని డిమాండ్

చిన్నకోడూర్, జనవరి 7: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజాగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికాక తప్పదని, హామీలు ఎగ్గొట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలు అమలు చేయాలని మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దీంతో రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను నయవంచనకు గురిచేసి అధికారాన్ని చేపట్టిందని మండిపడ్డారు. ఎన్నికలకలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేసుకొని కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి రోజుకో డ్రామాతో ప్రభుత్వం అలజడి సృష్టిసున్నదని ఆయన ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పు రూ.12 వేల భరోసా ఇస్తామనడం రైతులను మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 75 వేల కోట్ల రూపాయలను రైతుబంధు కింద అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతులకు ఇచ్చిన మాట నిలుపుకోకుండా రైతుద్రోహిగా సీఎం రేవంత్‌పై ముద్ర పడిందన్నారు. కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం, అన్ని పంటలకు 500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని రాధాకృష్ణ శర్మ ప్రశ్నించారు. రుణమాఫీ కోసం 42 వేల కోట్లు కావాలని చెప్పి, కేవలం 17 వేల కోట్లతో సగం మంది రైతులకు రుణమాఫీ చేసి రైతులను మరోసారి ప్రభుత్వం చేసిందన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తానని మోసం చేయడమే కాకుండా రెండు నెలల పింఛన్లు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నిరుద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులను మోసం చేసిన ఈ దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని రాధాకృష్ణ శర్మ పేర్కొన్నారు. రైతుల బాగుకోసం కేసీఆర్ వేల కోట్ల రూపాయలు వెచ్చించి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు నిర్మిస్తే, యాసంగికి నీరివ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. రైతులు వరినాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని, వెంటనే కాలువల ద్వారా చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమానికి అన్నివిధాలుగా కృషిచేసిన ఘనత కేసీఆర్‌ది అని రాధాకృష్ణ శర్మ కొనియాడారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు సదానందం గౌడ్, కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర, మాజీ ఎంపీటీసీల పురం అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుండెలి వేణు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు, సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూల మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

- జాతీయ రహదారి-765డీ పైన ప్రాణాలను కబళిస్తున్న మూల మలుపులు
- గుమ్మడిదల టోల్‌ప్లాజా-నర్సాపూర్ మీదుగా పదుల సంఖ్యలో మూలమలుపులు
- తరుచూ రోడ్డుప్రమాదాలు
- ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు లేవు
- ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐని కోరుతున్న ప్రయాణికులు, వాహనదారులు

గుమ్మడిద, జనవరి 7: బాలానగర్–మెదక్ జాతీయ రహదారి 765డీ పైన మూల మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల టోల్‌ప్లాజా నుంచి నర్సాపూర్ మీదుగా వెళ్తున్న జాతీయరహదారి 765డీ పైన 16 కిలోమీటర్ల మేర పదుల సంఖ్యలో యూటర్న్‌లు ఉన్నాయి. ఈ ప్రమాదకర మూలమలుపులు వాహనదారులకు ప్రాణసంకటగా మారాయి. గుమ్మడిదల టోల్‌ప్లాజా సమీపంలో గుమ్మడిదల వెళ్తున్న దారిలో గతంలో గుమ్మడిదలకు చెందిన రైతు సంజీవరెడ్డి ఉదయం పంటపొలానికి వెళ్లి, విద్యుత్ సరఫరా లేక పోవడంతోజాతీయరహదారి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంలో దానిని సరి చేయడానికి విద్యుత్ లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడానికి అక్కడికి వెళ్లాడు. ఇదే సమయంలో అటుగా వస్తున్న మట్టి టిప్పర్‌లారీ మూలమలుపు వద్ద నిలుచున్న రైతు మీదుగా పోవడంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. గుమ్మడిదల బస్‌స్టాండ్ సమీపంలో యూటర్న్ ఉండడంతో పదుల సంఖ్యలో వాహనదారులు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు.గుమ్మడిదల, మంభాపూర్, నల్లవల్లి అటవీ ప్రాంతంలో నర్సాపూర్‌కు వెళ్లే జాతీయరహదారిపై పదుల సంఖ్యలో యూటర్న్‌లు ఉన్నాయి. ఇటీవల నల్లవల్లి అటవీ ప్రాంతంలో మేడాలమ్మ ఆలయ సమీపంలో ఒక కారు, రెండు ఆటోలు ఢీ కొన్నడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పీఆర్ ఏఈఈ మనీషా, డిగ్రీ విద్యార్థి ఐశ్వర్యలక్ష్మి, ఉపాధికోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న మాలోతు ప్రవీణ్, కూలీ పని కోసం వెళ్తున్న అనసూయ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్ మీదుగా ప్రయాణిస్తున్న వాహనదారులు తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తమ వారిని కల్పోయి అనేక కుటుంబాలు బాధను అనుభవిస్తున్నాయి.

యూటర్న్‌ల వద్ద కానరాని ప్రమాద హెచ్చరికల బోర్డులు

గుమ్మడిదల– నర్సాపూర్ జాతీయరహదారిపై ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను స్థానికులు,వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. యూటర్న్‌ల వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయి. వెంటనే హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు. జాతీయరహదారి మీదుగా నర్సాపూర్–నల్లవల్లి అటవీ ప్రాంతంలో రోడ్లపైకి కోతులు రావడంతో ప్రయాణికులు వాటికి ఆహారం రోడ్లపైన వేస్తున్నారు. రోడ్లపైన కోతులకు పండ్లు, బఠాణీలు, ఆహార పొట్లాలను వేయవద్దని సూచిస్తున్నా ప్రయాణికులు పట్టించుకోవడం లేదు. ఇలా వేయడం వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

- ధరణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 7: పారదర్శక రెవెన్యూ పాలనే లక్ష్యంగా మెదక్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ పారదర్శక పాలన, ధరణి, ల్యాండ్ కేసులు, కోర్టు కేసులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఫారెస్ట్ భూసమస్యలు, సంబంధిత అంశాలపై జిల్లాలోని తహసీల్దార్లతో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్డీవోలు, తహసీల్దార్ స్థాయిలో ధరణి పెండింగ్ దరఖాస్తుల మ్యుటేషన్, పీవోబీ, సక్సెషన్, కోర్టు కేసులు, టీఎం 33 మాడ్యూల్స్‌ల పరిష్కారంలో వేగం పెంచి సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. వాటికి సంబంధించిన రికార్డులను సరైన విధంగా పరిశీలించాలన్నారు. భూములకు సంబంధించిన పత్రాలతో పాటు ఫీల్డ్ పొజిషన్ నివేదిక తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట, జనవరి 7 : సిద్దిపేట మున్సిపాలిటీని పన్ను వసూళ్లలో ప్రథమ స్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌తో కలిసి రెవెన్యూ, ట్రేడ్ లైసెన్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీసీబీ వివరాలను పరిశీలించి ఇంటి పన్ను వసూలు పై ఆరాతీశారు. మార్చి 31 వరకు ఇంటి పన్ను వసూళ్లకు గడువు ఉన్నందున, అంతకు ముందే వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా కృషిచేయాలన్నారు. పాత బకాయిలు, ప్రస్తుత బకాయిలు తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని అదనపు కలెక్టర్ కోరారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ ప్రేరణ, ఏఈఈ పృథ్వీ, ఆర్వో శ్రీకాంత్, ఆర్ఐలు బాలకృష్ణ, భారతి, అజ్వత్, బిల్ కలెక్టర్లు, ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- సీఎం రేవంత్ డ్రామాలు ఆపాలి
- డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న సీఎం
- కాంగ్రెస్‌ది అసమర్థ ప్రభుత్వం
- గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 7: ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకొవడానికే అక్రమ కేసులతో అరెస్టులు చేస్తున్నదని, ప్రభుత్వ తీరు దురదృష్టకరమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ అరెస్టులతో మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భయభ్రాంతులకు గురిచేసేలా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు అనేక రకాలుగా వేధింపులు, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతున్నదని, ఫార్ములా ఈ–రేస్ కేసులో కేటీఆర్‌పై అక్రమంగా బనాయించిన ఏసీబీ, ఈడీ కేసుల్లో పసలేదన్నారు. ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్ పేరు విశ్వవ్యాప్తంగా వినిపించేలా చేసిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్టులతో బెదిరించడం దురదృష్టకరని పేర్కొన్నారు. అసమర్థ విధానాలతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ఏసీబీ విచారణకు తన న్యాయవాదితో వెళ్లిన కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకోవడం రాజ్యాంగాన్ని కాలరాయడమే అని తెలిపారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాజ్యం నడుస్తున్నదని, పరిపాలన చేతకాక ప్రతిపక్షాల గొంతునొక్కే విధంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతూ బెదిరించడం సిగ్గుచేటన్నారు. రోజుకో డైవర్షన్ రాజకీయాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం సీఎం చేస్తున్నారని, ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని తెలిపారు. రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతున్నదని, పౌరహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నదని, చట్టబద్ధ సంస్థలను ఇష్టానురాజ్యంగా దుర్వినియోగం చేస్తున్నాదని మండిపడ్డారు. విచారణ సంస్థలు సైతం రేవంత్ ఆడే రాజకీయ క్రీడలో పావులుగా మారడం దురదృష్టకరని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీ యెద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, నవాజ్‌మీరా, కుమార్, రాష్ట్ర నాయకులు దేవీ రవీందర్, విరాసత్‌అలీ, మాజీ ఎంపీపీ పాండు, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కౌన్సిలర్ చందు, నాయకులు అర్జున్‌గౌడ్, రామచంద్రం, కనకయ్య, శ్రీధర్, కిరణ్‌గౌడ్, ఉమార్, నర్సింగరావు, దేవేందర్, కటికే శ్రీను, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా ఓటర్లు 4,51,225

- పురుషులు 2,16,528 మంది
- మహిళలు 2,34,688 మంది
- థర్డ్ జెండర్లు 9 మంది
- తుది ఓటరు జాబితా విడుదల
- వెల్లడించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జనవరి 7(నమస్తే తెలంగాణ) : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనల ప్రకారం ప్రత్యేక సవరణ 2025లో భాగంగా మెదక్ జిల్లా పరిధిలోని మెదక్–34, నర్సాపూర్– 37 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ విడుదల చేశారు. 34–మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 1,04,917 మంది పురుషులు, 1,15,987 మంది మహిళలు, 04 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 2,20,908 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 9 మంది పురుషులు, 1 మహిళ ఎన్ఆర్ఐ ఓటర్లు 10 మంది ఉన్నారని, సర్వీస్ ఓటర్లలో 87 మంది పురుషులు, 2 మహిళలు కలిపి 89 మంది ఉన్నారు. 37–నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 1,11,611 మంది పురుషులు, 1,18,701 మంది మహిళలు, 5 మంది థర్డ్‌జెండర్ కలిపి మొత్తం 2,30,317 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒకరు పురుష ఎన్ఆర్ఐ ఓటరు ఉండగా, సర్వీస్ ఓటర్లలో 36 మంది పురుషులు, 2 మహిళలు కలిపి 38 మంది ఉన్నారు. మొత్తం జిల్లా వారీగా 2,16,528 మంది పురుషులు, 2,34,688 మంది మహిళలు, 9 మంది థర్డ్ జెండర్ కలిపి 4,51,225 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 10 మంది పురుషులు, 1 మహిళ కలిపి 11 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. సర్వీస్ ఓటర్లలో 123 మంది పురుషులు, 4 మంది మహిళలు కలిపి 127 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల ప్రకారంపై ఓటర్ల జాబితాలను సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో, ఈఆర్‌వో కార్యాలయాల్లో, ఏఈఆర్‌వో, తహసీల్ కార్యాలయాల్లో, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్‌లో ప్రచురించారు. ఓటర్లు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందని ధృవీకరించుకోవాలని, ఏవైనా పొరపాట్లు లేదా మార్పులు అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని లేదా అధికారిక ఎన్నికల వెబ్ సైట్‌ను సందర్శించాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ సూచించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

విద్యార్థి అనిల్ కుమార్‌తో అధ్యాపకులు

రాయపోల్, జనవరి 7 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 హాకీ రాష్ట్రస్థాయి పోటీలకు దౌల్తాబాద్ ఆదర్శ కళాశాల విద్యార్థి అనిల్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరపున అనిల్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు.విద్యార్థి ఎంపిక కావడానికి కృషి చేసిన పాఠశాల పీడీ సురేశ్, అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు దక్కాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 7: అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇండ్లు ఉన్నవారికే ఇండ్లు ఇచ్చారని, లేనివారికి ఇవ్వలేదనే ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం గ్రామ సభలు నిర్వహించి అర్హులైన ఇల్లు లేని పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పెండింగ్ ఉన్న వాటిని, అన్ని గ్రామాల్లో లేని వారిని గ్రామాలకు పిలిపించి వారి వివరాలు సేకరించి సర్వే పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని కొల్లూరు, తెల్లాపూర్‌లలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద అంగన్‌వాడీ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేలా డీఈవో, జిల్లా వైద్యాధికారి, డీడబ్ల్యూవోలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇండ్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ చలపతి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా ఓటర్లు 14,40,151

- పురుషులు 7,21,186
- మహిళలు 7,18,827
- ఇతరులు 138 ఓటర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 7 : సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓటరు తుది జాబితాను ప్రకటించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈనెల ఒకటి నాటికి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఓటర్ల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్లు	మొత్తం ఓటర్లు
35–నారాయణఖేడ్	1,18,848	1,18,563	9	2,37,420
36– అందోల్ (ఎస్సీ)	1,23,244	1,29,386	3	2,52,633
38–జహీరాబాద్(ఎస్సీ)	1,38,914	1,39,315	3	2,78,232
39–సంగారెడ్డి	1,24,235	1,28,097	38	2,52,370
40–పటాన్‌చెరు	2,15,945	2,03,466	85	4,19,496
మొత్తం ఓటర్లు	**7,21,186**	**7,18,827**	**138**	**14,40,151**

ఎద్దుమైలారంలో దారుణం

- కిరాతకంగా 21 కుక్కల చంపివేత

సంగారెడ్డి, జనవరి 7(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో పెద్ద సంఖ్యలో కుక్కలు చనిపోవడం కలకలం రేపుతున్నది. వీధికుక్కల బెడద తొలిగించుకోవాలని గుర్తుతెలియని వ్యక్తులు 32 కుక్కల మూతులకు, కాళ్లకు బైడింగ్ వైర్లు చుట్టి సంగారెడ్డి జిల్లా కంది మండం ఎద్దుమైలారంలోని ఓ బ్రిడ్జి కింద పారవేశారు. ఈఘటనలో 21 కుక్కులు మృతి చెందగా, 11 కుక్కలను సిటిజన్ ఫర్ యానిమల్ సంస్థ రక్షించింది. రక్షించిన 11 కుక్కలను నాగోల్‌లోని పీపుల్స్ ఫర్ యానిమల్ సంస్థ షెల్టర్‌లో చికిత్స అందజేస్తున్నారు. ఇంద్రకరణ్ ఎస్సై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కంది మండలం ఎద్దుమైలారం సమీపంలోని రోడ్డు కమ్ బ్రిడ్జి కింద 32 కుక్కలను గుర్తుతెలియని వ్యక్తులు మూతులు, కాళ్లను బైండింగ్ వైర్లతో కట్టి బ్రిడ్జి పై నుంచి పడేశారు. బ్రిడ్జి పై నుంచి విసిరివేయడం, మూతులకు బైండింగ్‌వైరు చుట్టడంతో 21 కుక్కలు మృతిచెందాయి. బతికి ఉన్న కుక్కలు ఆరుస్తుండడంతో బ్రిడ్జి పై నుంచి వెళ్లిన వాహనదారుల్లో ఒకరు గుర్తించి సిటిజన్స్ ఫర్ యానిమల్స్ సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. సిటిజన్స్ ఫర్ ఎనిమల్స్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్ నుంచి ఇంద్రకరణ్ పోలీసులు వద్దకు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లగా 21 కుక్కలు చనిపోయినట్లు గుర్తించారు. 11 కుక్కలను సిటిజన్ ఫర్ ఎనిమల్స్ సంస్థ ప్రతినిధులు కాపాడి యానిమల్ వారియర్స్, పీపుల్స్ ఫర్ యానిమల్స్ సంస్థల సహాయంతో వాటిని నాగోల్‌లోని షెల్టర్‌కు తరలించి చికిత్స అందజేశారు. కాపాడిన 11 కుక్కల్లో మూడు కుక్కల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇంద్రకరణ్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం పశుసంవర్ధక శాఖ వైద్యులు పోలీసుల సమక్షంలో 21 కుక్కలకు పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన కుక్కల నుంచి సేకరించిన కొన్ని అవయవాలను ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాతే కుక్కల మృతి కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. సీసీ టీవీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సమీపంలోని గ్రామాల్లోని వారు కుక్కల బెడద తట్టుకోలేక కుక్కలను బ్రిడ్జి కింద పడవేసారా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ సంస్థ ప్రతినిధి పృథ్వీ తెలిపారు. ఎద్దుమైలారంలో కుక్కల మృతికి సంబందించి జంతు హక్కుల ఉద్యమకర్త మేనకాగాంధీ కలుగజేసుకుని పోలీసు కేసు నమోదు అయ్యేలా చూశారని చెప్పారు.